క్లుప్తంగా

మున్సిపల్ అభివృద్ధికి సహకరించండి



పన్ను వసూలు చేస్తున్న కమిషనర్ వేణు

వైరా: ప్రతి ఒక్కరూ పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ చింతల వేణు అన్నారు. బుధవారం వైరా మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డుల్లో సిబ్బంది చేపట్టిన పన్నుల వసూళ్ల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. 20వ వార్డులో ఓ ఇంటికి రూ.40వేలు పన్ను వసూలు చేసినట్లు సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

'పీఎం కుసుమ్'కు దరఖాస్తు చేసుకోండి

కొణిజర్ల: ప్రధాన మంత్రి కిసాన్ ఊర్జా సురక్షా ఏవం ఉత్థాన్ మహాభియాన్ (పీఎం కుసుమ్) పథకానికి ఈ నెల 22లోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ రోజారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు బంజరు, వ్యవసాయ భూముల్లో 4000 మెగా వాట్ల సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవచ్చని, దీంతో రైతులకు అదనపు ఆదాయంతో పాటు ఇంధన వనరుల వాడకాన్ని పోత్సహించడం జరగుతుందన్నారు.

మిర్చిబోర్డు ఏర్పాటు చేయాలి



మిర్చి కొనుగోళ్లను పరిశీలిస్తున్న రైతుసంఘం నాయకులు

ఏన్కూరు: ఖమ్మంలో మిర్చిబోర్డు ఏర్పాటుకు వ్యవసాయమంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవ తీసుకోవాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. స్థానిక మిర్చి మార్కెట్‌ను తెలంగాణ రైతుసంఘం బృందం బుధవారం పరిశీలించింది. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ.. మిర్చి రైతులకు తెగుళ్ల మూలంగా నష్టం జరిగిందని, మరోవైపు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగేశ్వరావు, లక్ష్మా, వెంకటేశ్వరావు, వెంకటేష్ పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ

మధిర: తెలంగాణ ప్రగతిశీల హమాలీ అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 4వ మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ మధిర పట్టణంలోని ధర్మన్న భవన్‌లో బుధవారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి వై పుల్లయ్య, పార్టీ వైరా డివిజన్ కార్యదర్శి కే అర్జున్ రావు పాల్గొని మాట్లాడారు. ఈనెల 21న ఖమ్మంలోని రామ నరసయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ మహాసభ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో బండారు భద్రయ్య, ఎలదండి బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ కమ్యూనిస్టు శ్రీనివాసరావు

వైరా: నిబద్ధతతో పనిచేసిన ఆదర్శ కమ్యూనిస్టు వేదగిరి శ్రీనివాసరావు అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు అన్నారు. బుధవారం శ్రీనివాసరావు వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వారు పాల్గొని మాట్లాడారు. కూలీల తరపున జీవితాంతం పోరాడిన ఘనత శ్రీనివాసరావుది అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చలపతిరావు, శ్రీనివాసరావు కళావతి, మణి, రజిత, సమత, కృష్ణారావు, చంద్రశేఖర్, రామారావు, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

పాలకవర్గాల గడువు పొడిగింపు హర్షణీయం



మాట్లాడుతున్న డీసీసీబీ డైరెక్టర్ కృష్ణయ్య

సత్తుపల్లిటౌన్: ఈ నెల 14వ తేదీతో ముగిసిన సహకార సొసైటీల పాలకవర్గాల గడువును ఆరు నెలలు పొడిగించటంపై సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావులకు సత్తుపల్లి సొసైటీ అధ్యక్షుడు, డీసీసీబీ డైరెక్టర్ చల్లగుండ్ల కృష్ణయ్య, ఉపాధ్యక్షుడు గాదె చెన్నారావు కృతజ్ఞతలు తెలిపారు. సత్తుపలిలో బుధవారం సత్తుపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో డైరెక్టర్లు చల్లగుళ్ల నరసింహారావు, కె.నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఉత్సవాలకు వేళాయె..

మహాశివరాత్రి వేడుకలకు శివాలయాలు ముస్తాబు

- శైవ క్షేత్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు
- ఈ నెల 26న శివపార్వతుల కల్యాణం
- మూడు రోజులు భక్తి కార్యక్రమాలు
- భారీగా తరలిరానున్న భక్తులు



వందనంలో ముస్తాబైన శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం

చింతకాని: మహాశివరాత్రి ఉత్సవాలకు పలు గ్రామాల్లో ఉన్నటువంటి శివాలయాలు ముస్తాబయ్యాయి. మూడు రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాలు ఈ నెల 26 తెల్లవారుజాము నుంచి ప్రారంభమవుతాయి. ఆలయాల్లో స్వామికి మహాభిషేకం, కుంకుమార్చన, అభిషేకములు వంటి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు సర్వం సిద్ధం చేశారు.



నేరడ గ్రామంలో ముస్తాబైన శివాలయం

మండలంలోని ముస్తాబైన ఆలయాలు..

వందనం గ్రామంలో ఉన్నటువంటి పురాతన దేవాలయమైన శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయానికి రంగులు వేసి విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే నేరడ గ్రామంలోని భ్రమరాంబ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి, పందిళ్లపల్లి గ్రామంలోని శ్రీ గంగా గౌరీ సమేత రామలింగేశ్వర స్వామి, కొదుమూరులోని శ్రీ రామలింగేశ్వరస్వామి, పాతర్లపాడు, నాగులవంచ, నాగిలిగొండ గ్రామాల్లోని శివాలయాలను కూడా ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్సవాల్లో భక్తుల సౌకర్యార్థం ఆలయ నిర్వాహకులు ఆలయాల వద్ద షామియానాలు ఏర్పాటు చేసి మంచినీటి, వైద్య సౌకర్యాలను కల్పిస్తున్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు..



మహాశివరాత్రి ఉత్సవాల్లో మద్యం అమ్మకాలు, డీజే ఏర్పాట్లు చేయొద్దు.. ఎవరైనా అలా చేస్తే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటాం. ఆలయాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు తగిన సౌకర్యాలను కల్పించాలి. ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ, గ్రామస్తులు పూర్తి సహకారాలు అందించాలి.

– షేక్ నాగుల్‌మీరా, ఎస్సై, చింతకాని

ఆశీస్సులు పొందాలి..



మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం నుంచి ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తాం. ఈ సందర్భంగా ఆలయాల్లో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహావచనం, అఖండ దీపారాధన వంటి పూజలతో పాటు ప్రత్యేక అభిషేక పూజలను నిర్వహిస్తాం. భక్తులు ఉత్సవాల్లో పాల్గొని స్వామి కల్యాణం తిలకించి ఆశీస్సులు పొందాలి.

– రాంబాబు, శివాలయ అర్చకుడు, వందనం

అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలి



మాట్లాడుతున్న ట్రైయినీ ఎస్సై వెంకటేష్

తల్లాడ: అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలని హెచ్ ఎం ట్రెయినీ ఎస్సై వెంకటేష్ అన్నారు. బుధవారం కుర్నవల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలికా సాధికారత అంశంపై నిర్వహించిన సమావేశంలో ట్రెయినీ ఎస్సైతో పాటు పాఠశాల హెచ్‌ఎం జాన్సీరాణి మాట్లాడారు. అపరిచితులతో చాటింగ్ చేయడం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ లపై వివరించారు. సైబర్‌గ్రీవెన్స్ ఫోన్ నంబర్ 1930 గురించి వివరించారు. అదే విధంగా కుర్నవల్లి ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్ విద్యార్థులు పొదుపు ఎలా చేసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో జీసీఈసీ కన్వీనర్ జె.ఇంద్రాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొరపాట్లు లేకుండా నమోదు చేయాలి

మధిర: వ్యవసాయ విస్తరణ అధికారులు పకడ్బందీగా పంట నమోదు కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని వ్యవసాయ సంచాలకురాలు స్వర్ణ విజయచంద్ర తెలిపారు. బుధవారం మండలంలోని మడన సమీపంలో నిర్వహిస్తున్న డిజిటల్ పంట నమోదు కార్యక్రమాన్ని ఆమె పరిశీలించి మాట్లాడారు. రైతులు సాగు చేసిన ప్రతీ పంటను ఏఈఓలు పొరపాట్లు లేకుండా నమోదు చేయాలన్నారు. తద్వారా పంటను అమ్ముకోవడానికి రైతులకు ఇబ్బందులు ఉండవన్నారు. అనంతరం ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధిలో భాగంగా ఫిజికల్ వెరిఫికేషన్ పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కనకం సాయి దీక్షిత్, వ్యవసాయ విస్తరణ అధికారులు అమృత, జిష్ణు పాల్గొన్నారు.



పంట నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ

మహాసభలను జయప్రదం చేయండి



కొణిజర్ల: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు

పెనుబల్లి/కొణిజర్ల: ఈ నెల 21న ఖమ్మంలో నిర్వహించనున్న హమాలీ, మిల్ వర్కర్స్ యూనియన్ నాల్గో రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు డి.శ్రీనివాసరావు, టీయూసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం పెనుబల్లిలోని లంకాసాగర్ రైస్‌మిల్లు ఆవరణలో, కొణిజర్ల మండలంలోని యల్లన్ననగర్‌లో నిర్వహించిన సమావేశంలో మహాసభల వాల్‌పోస్టర్లను స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణలో దాదాపు 5 లక్షల మందికి పైగా హమాలీ వర్కర్లు వివిధ రంగాల్లో పని చేస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హమాలీలకు ఎటువంటి చట్ట బద్ధమైన హక్కులు కల్పించకుండా అన్యాయం చేస్తున్నాయన్నారు. డిమాండ్‌ల సాధనకై, కార్మికుల హక్కుల కోసం పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పుల్లారావు, నాయకులు సీతయ్య, వెంకటేశ్వర్లు, రాజు, వెంకటేష్, ఆలకుంట శ్రీను, సురేష్, చిన్నశ్రీను, బలరామ్, నాగరాజు, దుంపసురేష్, నరసారావు, వెంకన్న, కృష్ణ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

21నుంచి ఆలయ ప్రతిష్ఠ ఉత్సవాలు

తల్లాడ: మండలంలోని పినపాక గ్రామంలో ఈ నెల 21 నుంచి 23 వరకు సోమలింగేశ్వర స్వామి దేవాలయం ప్రతిష్ఠా మహోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ నారాయణరావు బుధవారం తెలిపారు. 21న శాంతి పాఠం, గురువందనం, గోపూజ, ధ్వజారోహణం, మహాగణపతి పూజ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, 22న శయ్యాది వాసం, పుష్పాది వాసం, సాముహిక కుంకుమార్చన, ప్రదోషకాల పూజ, రాజోపచారములు, మంగళ హారతి, మంత్ర పుష్పం, 23న సోమలింగేశ్వర స్వామి ప్రతిష్ఠాపన, మహా అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించండి

రవీందర్ తరపున ప్రచారం..

తల్లాడ: ఉపాధ్యాయ అధ్యాపకుల సమస్యల పరిష్కారానికై జాక్టో బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్‌ను గెలిపించాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పర్వతరెడ్డి అన్నారు. తల్లాడలో బుధవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 27న జరగబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ పూల రవీందర్‌కు మొదటి ప్రాధాన్యతగా ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా కార్యదర్శి కరామత్ ఆలీ, చిరంజీవులు, ఉషశ్రీ, వెంకయ్య పాల్గొన్నారు.

శ్రీపాల్‌రెడ్డి తరపున..

బోనకల్: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికై పోరాడే పీఆర్‌టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి పింగళి శ్రీపాల్‌రెడ్డిని ఎన్నికల్లో గెలిపించాలని ఆ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పుట్లూరి వెంకటరెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు మోతుకూరి రవి కోరారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఉపాధ్యాయుల నుంచి పీఆర్‌టీయూ అభ్యర్థికి మంచి ఆదరణ లభిస్తుందన్నారు. మెరుగైన పీఆర్‌సీతో పాటు, సీపీఎస్ రద్దు, ఉపాధ్యాయ పెండింగ్ బకాయిలను విడుదల అయ్యేలా చూస్తామని తెలిపారు.

'ఉపాధి' పనులపై సామాజిక తనిఖీ



మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

కల్లూరురూరల్: మండలంలో 2023–24 సంవత్సరానికి సంబంధించి అన్ని పంచాయతీల్లోని 'ఉపాధి' పనులపై మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ దాసరి చంద్రశేఖర్ సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 11బృందాలు పాల్గొన్నారు. అనంతరం పంచాయతీలకు వెళ్లి ఉపాధి పనుల వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీఓ రంజిత్‌కుమార్, ఈజీఎస్ ఏపీఓ పుల్లారావు, ఏపీఓ హేమమాలిని, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ చందర్

బోనకల్: మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తహసీల్దార్ పున్నం చందర్ బుధవారం పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం వడ్డిస్తున్నారా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఆయన వెంట మండల విద్యాశాఖాధికారి దామాల పుల్లయ్య, ఆర్‌ఐ లక్ష్మణ్‌నాయక్ తదితరులున్నారు.

ఎంపీ రామసహాయం జన్మదిన వేడుకలు



సత్తుపల్లిలో కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

వైరా/సత్తుపల్లి/కల్లూరురూరల్/ముదిగొండ: ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామరెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. సత్తుపల్లిలో ఎమ్మెల్యే రాగమయి, వైరాలో మాజీ మున్సిపల్ చైర్మన్ జైపాల్, కల్లూరులోని నారాయణపురంలో పొంగులేటి సోదరుడు ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో, ముదిగొండలో నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి ఎంపీకి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కొర్లగూడెం సొసైటీ చైర్మన్ కీసర వెంకటేశ్వరరెడ్డి, కాంగ్రెస్ నాయకులు రాజశేఖర్, మోహనరెడ్డి, సత్యం, రామకృష్ణ, రామకృష్ణ, శ్రీకాంత్, కృష్ణారెడ్డి, రాంబాబు, సంజీవరెడ్డి, సైదులు, రంగారావు, కన్నయ్య, రాంప్రసాద్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ మార్గం అనుసరణీయం



ఏన్కూరు: బంజార మహిళలతో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

కారేపల్లి/ఏన్కూరు: బంజారుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ మార్గం అనుసరణీయమని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ అన్నారు. బుధవారం కారేపల్లిలో సంత్‌సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల్లో భాగంగా.. బంజార సోదరులు నిర్వహించిన బోగ్ భండారో కార్యక్రమంలో ఆయన పాల్గొని పూజలు నిర్వహించారు. అంతకు ముందు బంజార మహిళలు కారేపల్లి అంబేడ్కర్ సెంటర్‌నుంచి బస్టాండ్ సెంటర్ మీదుగా కస్తూర్బా విద్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన వేదిక వరకు ర్యాలీగా ప్రదర్శన చేశారు. అదే విధంగా ఏన్కూరు మండలంలోని హిమామ్‌నగర్‌లో నిర్వహించిన సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో పాల్గొనగా.. ఆయనకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆంజనేయస్వామి దేవాలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బంజరాల ఆరాధ్యదైవం, దేశం గర్వించదగ్గ గొప్ప వ్యక్తి సేవాలాల్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో లంబాడ ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు రాజ్‌కుమార్ జాదవ్, మాజీ ఎంపీపీ దేవ్లా నాయక్, ఆర్టీఐ మాజీ కమిషనర్ శంకర్ నాయక్, నాయకులు రాములు, రామ్మూర్తి, హీరాలాల్, భీముడు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలను అడ్డుకుంటాం..



ఆందోళన చేస్తున్న కారేపల్లి గ్రామస్తులు

కారేపల్లి: బీసీ హాస్టల్‌కు సంబంధించిన స్థలాన్ని ఆక్రమిస్తే సహించేది లేదని, విద్యాలయానికి వినియోగించాలని కారేపల్లి గ్రామస్తులు బుధవారం ఆందోళనకు దిగారు. కారేపల్లిలోని ప్రభుత్వ స్థలం సర్వే నంబర్ 38లో రెండేళ్ల క్రితం బీసీ బాలుర వసతి గృహానికి 17 గుంటల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించగా.. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బోర్డు సైతం ఏర్పాటు చేశారు. ఆ స్థలంలో ఓ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు ఎటువంటి అనుమతులు లేకుండా గద్దెలు కట్టారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడకు చేరుకుని ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో గ్రామస్తులకు, సామాజిక వర్గానికి చెందిన కొంతమంది వ్యక్తులతో వాగ్వాదం జరిగ్గా.. కొంతమంది పెద్దలు కలగజేసుకోవడంతో వివాదం సద్దుమనిగింది. విషయాన్ని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌కు తెలుపగా.. ఆయన కారేపల్లి చేరుకొని ప్రభుత్వం స్థలంలో విద్యాలయాలకు సంబంధించిన నిర్మాణాలు జరుగుతాయని హామీ ఇచ్చారు.

సాగర్ నీరు రోడ్డు పాలు



న్యూలక్ష్మీపురం - సువర్ణాపురం ప్రధాన రహదారిపై వృథాగా పోతున్న సాగర్ జలాలు

ముదిగొండ: మండలంలోని సాగర్ జలాలు విడుదల చేసినప్పటి నుంచి పలు కాలువల్లోని నీరు వృథాగా పోతుంది. సువర్ణాపురం ప్రధాన రహదారి పక్కన ఓ రైతు మొక్కజొన్న చేనుకు ఐదురోజుల నుంచి నీరు పెట్టి అలానే ఉంచాడు. దీంతో చేలోనుంచి నీరు నేరుగా రోడ్డుపైన కాలువలా పారుతుంది. ఇంత జరుగుతున్నా అధికారులు కూడా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. అసలే వారబందీ విధానం.. దీనికి తోడు రైతు నిర్వాహకం, అధికారుల నిర్లక్ష్యంతో చివరి ఆయకట్టు భూములకు నీరందడం లేదు. దీంతో పలువురు రైతులు అసలే పంటలకు నీరులేక చస్తుంటే వీడెవడండి బాబు అంటూ తమ ఆవేదన వ్యక్తం చేశారు. కంకర తేలిన రోడ్డుపై నీరు వృథాగా పోవడంతో ప్రయాణికులు రాకపోకల సమయంలో ఇబ్బందులు పడుతున్నారు.

సాగర్ జలాలు విడుదల చేయాలి

ఎర్రుపాలెం: మండలంలోని కట్లేరు ప్రాజెక్టుకు నాగార్జున సాగర్ జలాలు విడుదల చేయాలని రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు దివ్వెల వీరయ్య, సీపీఎం మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని మామునూరు గ్రామంలో సాగునీరు లేక ఎండిపోతున్న మొక్కజొన్న, వరి పంటలను వారు పరిశీలించారు. పంట కాల్వలకు మరమ్మతులు చేయాలని, లేకపోతే ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకులు కోటేశ్వరరావు, రైతులు శ్రీనివాసరావు, శ్రీహరినారాయణ, అమల, బాపయ్య తదితరులున్నారు.

పెన్షన్లు విడుదల చేయాలి

పెనుబల్లి: రిటైర్డు ఉపాధ్యాయ, ఉద్యోగుల పెన్షన్లను వెంటనే విడుదల చేయాలని టీపీటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మట్టపల్లి రాధా కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీపీటీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా బుధవారం విలేకర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గురుప్రసాద్, రామారావు, శ్రీను, రమేష్, ఉపేందర్ పాల్గొన్నారు.

వితరణల వెల్లువ..

ఆలయ నిర్మాణానికి రూ.58,116 విరాళం

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి ద్వారకాపురి కాలనీలో శ్రీప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి సత్తుపల్లి కేర్ డయాగ్నస్టిక్ సెంటర్ యజమాని మత్తి ఆదివిష్ణు నారాయణమూర్తి – నిర్మల బుధవారం రూ.58,116 విరాళం అందజేశారు. ఆలయ నిర్వాహకులు ద్రోణంరాజు మల్లికార్జునశర్మ, వందనపు సత్యనారాయణ, రాగాల చంద్రారెడ్డి, సోమిశెట్టి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థినికి రూ.90 వేలు..



సంధ్య తల్లిదండ్రులకు చెక్కు అందజేస్తున్న రామారావు

కల్లూరు: కల్లూరు అంబేడ్కర్ నగర్‌కు చెందిన శెట్టి దేవదారు, భాయమ్మల కుమార్తె సంధ్య ఎమ్ఎస్‌సీ మెరైన్ బయాలజీ పాండిచేరి సెంట్రల్ అండమాన్ నికోబార్ ఐలాండ్ యూనివర్శిటీలో మొదటి సంవత్సరం చదువుతోంది. విద్యార్థి కనీసం ఫీజు కూడా కట్టలేని స్థితిలో ఉండడంతో.. విషయం తెలుసుకున్న స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి వరకా రామారావు ఫౌండేషన్ దాతల దృష్టికి తీసుకెళ్లి వారి ద్వారా సంధ్యకు రెండు సంవత్సరాల ఫీజులో భాగంగా ఒక ఏడాది ఫీజు రూ.90 వేల చెక్‌ను తల్లిదండ్రులకు అందచేశారు.

కళాశాల వాటర్ ట్యాంక్‌కు..



వాటర్ ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న దాతలు

వైరా: దాతృత్వానికి మించిన సంపద మరేదీ లేదని వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నవీన జ్యోతి అన్నారు. వైరాకు చెందిన స్వర్గీయ కొప్పురావూరి పురుషోత్తమరావు జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు కళాశాలకు వాటర్ ట్యాంక్ నిర్మాణానికి వితరణ చేశారు. బుధవారం ట్యాంక్‌ను దాతలు పురుషోత్తమరావు భార్య లక్ష్మి, కుమారుడు రఘువీర్‌లు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కాలేజీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు వాటర్ కూలర్..

వైరారూరల్: మండలంలోని ఖానాపురం ప్రాథమిక పాఠశాలకు బుధవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో దాతలు కొణతలపల్లి వేణు, షేక్ లాల్ మహ్మద్ ఆర్థిక సాయంతో రూ.20 వేలు విలువ చేసే వాటర్ కూలర్‌ను వితరణ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ పాస్ట్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, వుంద్రూ శ్యాంబాబు, చింతోజు నాగేశ్వరరావు, చింతలపూడి వెంకటేశ్వరరావు, అబ్బూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి



చింతకాని: నాగులవంచలో శివాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

కల్లూరు/చింతకాని: ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు కల్లూరులో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కల్లూరులోని శ్రీ సంతాన వేణుగోపాలస్వామి దేవాలయం నుంచి పట్టణంలోని పుర వీధులలో ద్విచక్ర వాహనాలతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అదే విధంగా చింతకాని మండలంలోని నాగులవంచలో బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో శివాజీ విగ్రహానికి పాలాభిషేకం చేసి.. పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ మండలాధ్యక్షుడు గోపి, బీజేపీ ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు మాట్లాడుతూ.. యువత ఛత్రపతి శివాజీని స్ఫూర్తిగా తీసుకుని ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మధిర అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు, నాయకులు రామారావు, అనంతరెడ్డి, శ్రీను, తాతారావు, కృష్ణ, వీహెచ్‌పీ మండల అధ్యక్షుడు కృష్ణ, కార్యదర్శి జగదీష్, దేవాలయం మాజీ చైర్మన్ శ్రీనివాసరావు, కృష్ణ, సత్యనారాయణ, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.